సాక్షి వికారాబాద్

ఆదివారం । 29 । జనవరి । 2023



బకాయిలు చెల్లించకుంటే..

రుణాలు చెల్లించని రైతుల భూములను వేలం వేస్తామని తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం సీఈఓ తెలిపారు.

8లో▸



సర్పంచ్ మృతి

రోడ్డు ప్రమాదంలో సర్పంచ్ మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి ధారూరు పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది.

8లో▸



'పది' కీలకం

విద్యార్థి జీవితంలో పదో తరగతి పునాది వంటిదని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు.

10లో▸

న్యూస్‌రీల్

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోండి

- చట్టాలపై అవగాహన అవసరం
- జిల్లా లీగల్ ఆఫీసర్ నరేశ్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా లీగల్ ఆఫీసర్ నరేశ్‌కుమార్

తాండూరు రూరల్: బాలికలు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని సాధన దిశగా నిరంతరం కృషి చేయాలని జిల్లా లీగల్ ఆఫీసర్ నరేశ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని మహాత్మా జ్యోతిరావు బాలికల వసతి గృహంలో 'జాతీయ బాలికల దినోత్సవం' నిర్వహించారు. ఈ సందర్భంగా నరేశ్‌కుమార్ మాట్లాడుతూ.. చట్టాలపై బాలికలకు అవగాహన అవసరమన్నారు. బాలికల సంక్షేమం కోసం ఎన్నో చట్టాలు ఉన్నాయని తెలిపారు. ఆడపిల్లలపై వివక్ష చూపొద్దన్నారు. చదువు అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఇష్టంతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఎస్‌ఐ చంద్రశేఖర్, షీటీం ఇన్‌చార్జి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటమే శరణ్యం

ఎంఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొండయ్య



టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కొండయ్య తదితరులు

బంట్వారం: సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాలు పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని మోడల్ స్కూల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండయ్య అన్నారు. శనివారం బంట్వారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట టీఎస్‌యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు వెంకటేశం ఆధ్వర్యంలో సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొండయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంఘాలు ఏవైనా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం విషయంలో కలిసి పోరాటం చేయాలన్నారు. మోడల్ స్కూళ్లలో పని చేసే టీచర్ల సమస్యలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ చంద్రప్ప, సూపరింటెండెంట్ సుశీల్‌కుమార్ షిండే, షఫీ, టీఎస్‌యూటీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

15లోపు ఇంటి పన్నులు వసూలు చేయాలి



మాట్లాడుతున్న డీపీఓ తరుణ్‌కుమార్

అనంతగిరి: వచ్చేనెలా 15లోగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు వంద శాతం వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈమేరకు శనివారం వికారాబాద్ మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులు చేపట్టాలన్నారు. తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని తెలిపారు. కంపోస్టు షెడ్‌లో తడిపొడి చెత్తతో ఎరువును తయారు చేయాలన్నారు. నర్సరీలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మొక్కలు ఏపుగా ఎదిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన రికార్డులను విధిగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ అనిత, ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ నాగరాజు, ఉపాధిహామీ ఈసీ నవీన్‌కుమార్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తెలంగాణ కళా వేదిక లోగో ఆవిష్కరణ

అబ్దుల్లాపూర్‌మెట్: కళాకారుల నైపుణ్యాన్ని ప్రోత్సహించేందుకు ఇనాంగూడ గ్రామానికి చెందిన శ్రీరాం నరేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ కళా వేదిక లోగోను శనివారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జనపతి రాముయాదవ్, జంగయ్య, లక్ష్మయ్య, సాయిముదిరాజ్ ఉన్నారు.

తిరుగు బావుటా

జిల్లాలో మున్సిపల్ రాజకీయాలు రంజుగా మారాయి. వికారాబాద్, తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్లపై అవిశ్వాసం పెట్టాలంటూ ప్రత్యర్థి వర్గాలు శనివారం కలెక్టర్‌కు నోటీసులు అందజేశాయి. ఈ మేరకు మద్దతుదారుల సంతకాలతో అవిశ్వాస పత్రాలు అందించారు. అధికార పార్టీలో కౌన్సిల్ సభ్యులు రెండుగా చీలిపోయారు. ఫిఫ్టీఫిఫ్టీ పదవీ ఒప్పందం బెడిసికొట్టడంతో వైరీవర్గాలు కొంత కాలంగా గుర్రుగా ఉన్నాయి. ఇదిలా ఉంటే పాలకవర్గం పదవీ గొడవలతో పాలన కుంటుపడిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

అవిశ్వాస తీర్మానానికి పట్టు

- కలెక్టర్ వద్దకు అసంతృప్త నేతలు
- నోటీసులు అందజేత
- వికారాబాద్, తాండూరు మున్సిపాలిటీల్లో రాజకీయం రసవత్తరం

వికారాబాద్ అర్బన్/తాండూరు: ఫిఫ్టీఫిఫ్టీ పదవీ ఒప్పందం గడువు ముగిసినా ప్రస్తుత చైర్‌పర్సన్లు పదవి నుంచి దిగేందుకు ససేమిరా అంటుండటంతో అసమ్మతి రాజకీయాలు వేడెక్కాయి. వికారాబాద్, తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్లు చిగుళ్లపల్లి మంజుల, స్వప్నపరిమళ్‌పై ప్రత్యర్థి వర్గాలు మండి పడుతున్నాయి. వికారాబాద్‌లో చైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్న లంక పుష్పలతా రెడ్డి చిగుళ్లపల్లి మంజులపై అవిశ్వాసం పెట్టాలంటూ స్థానిక ఎమ్మెల్యేపై ఒత్తిడి తెచ్చారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ సమక్షంలో 19 బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు సమావేశమయ్యారు. అవిశ్వాస పత్రంపై సంతకం పెట్టారు. అనంతరం మూకుమ్మడిగా కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్‌కు అవిశ్వాస పత్రం అందజేశారు. కౌన్సిలర్ల సంతకాలు సరైనవా కావా అనే విషయాన్ని ధ్రువీకరించాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్రను ఆదేశించారు. ఈ విషయంపై మూడు రోజు ల్లో కమిషనర్ కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నారు.

రెండుగా చీలిన బీఆర్‌ఎస్

వికారాబాద్ మున్సిపాలిటీలో మొత్తం 34 మంది కౌన్సిలర్లు ఉండగా అధికార బీఆర్‌ఎస్ పార్టీకి 26 మంది కౌన్సిలర్లు ఉన్నారు. 19వ వార్డు కౌన్సిలర్ రాయికల్ నర్సింహులు మృతిచెందడంతో బీఆర్‌ఎస్‌కు ప్రస్తుతం 25 మంది కౌన్సిలర్లు ఉన్నారు. 4వ వార్డు ఎంఐఎం కౌన్సిలర్ నజ్రీన్ బేగంతో కలిపి అవిశ్వాస పత్రంపై 20మంది సంతకాలు చేశారు. చైర్‌పర్సన్ మంజుల రమేష్, వైస్ చైర్‌పర్సన్ శంషాద్ బేగంలు కాకుండా, 31వ వార్డు కౌన్సిలర్ గాయత్రి లక్ష్మణ్, 28వ వార్డు మొముల స్వాతి, 6వ వార్డు చందర్‌నాయక్, 34వ వార్డు అనంతలక్ష్మీలు అవిశ్వాస పత్రంపై సంతకం పెట్టలేదు. ఇలా అధికార పార్టీ కౌన్సిలర్లు రెండుగా చీలడంతో మున్సిపల్ రాజకీయాలపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

అవిశ్వాసం తప్పనిసరి అయ్యే అవకాశం..

వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం తప్పనిసరిగా కనిపిస్తోంది. నాలుగేళ్లు పూర్తయితేనే అవిశ్వాసం పెట్టాలన్న చట్టం ఆమోదం పొందితే చైర్‌పర్సన్ వ్యతిరేక వర్గం కొంత స్తబ్దుగా ఉండాలని భావించారు. ఆ చట్టం ఆమోదం పొందక పోవడంతో అవిశ్వాసం పెట్టి తమ పంత నెగ్గించుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. ఈ క్లిష్ట సమయంలో అధిష్టానం ఏ నిర్ణయం తీసుకుంటుందన్న విషయంపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది. అవిశ్వాసం తప్పనిసరి అయితే మాత్రం చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌కు పదవి గండం తప్పదనే ప్రచారం ఉంది. ఎంఐఎం మద్దతులో లంక పుష్పలతా రెడ్డికి 20 మంది కౌన్సిలర్ల మద్దతు ఉండగా, ప్రస్తుత చైర్‌పర్సన్ మంజుల రమేశ్‌కు, వైస్ చైర్‌పర్సన్‌తో పాటు మరో నలుగురి మద్దతు ఉంది. అంటే మొత్తం ఆరుగురి బలం ఉంది. బీజేపీ కౌన్సిలర్ శ్రీదేవి దూరంగా ఉంటామని ప్రకటించారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆరుగురు ఎటు ఉంటారనే దానిపై స్పష్టత లేదు. కాంగ్రెస్ కౌన్సిలర్లు ఒకవేళ మంజులకు మద్దతు తెలిపినా బలనిరూపణకు సంఖ్య సరిపడే పరిస్థితి లేదు.



అవిశ్వాసంపై నోటీసు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

సందిగ్ధంలో పట్నం వర్గీయులు

తాండూరులో అవిశ్వాసం తెరపైకి రావడంతో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి వర్గీయులు సందిగ్ధంలో పడ్డారు. మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్‌పై వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల దీపతో పాటు అధికార పార్టీ కౌన్సిలర్లు, బీజేపీ, కాంగ్రెస్, టీజేఎస్, ఎంఐఎం పార్టీలకు చెందిన కౌన్సిలర్లు సైతం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కలెక్టర్‌కు నోటీసును అందించారు. దీపకు మద్దతుగా 23 మంది కౌన్సిలర్లు సంతకాలు చేశారు. గతంలో కుదుర్చుకున్న ఫిఫ్టీ ఫిఫ్టీ ఒప్పందం ప్రకారం రాజీనామా చేయకపోవడం వల్లే తాము అవిశ్వాస తీర్మానానికి వెళ్తున్నామని కౌన్సిలర్లు చెబుతున్నారు.

నాటి నుంచి విభేదాలే..

మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పట్నం వర్గానికి చెందిన స్వప్నపరిమళ్ బాధ్యతలు చేపట్టారు. అయితే అప్పటి నుంచి వైస్ చైర్‌పర్సన్ మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. పదవీ ఒప్పందం ప్రకారం స్వప్నపరిమళ్ రాజీనామా చేయాలి. కానీ పలు కారణాలను చూపిస్తూ పదవికి రాజీనామా చేసేప్రసక్తేలేదని ప్రకటించారు.అధికార పార్టీలోని 13 మంది కౌన్సిలర్లు, కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బీజేపీ నుంచి 5 మంది, ఎంఐఎంలో ముగ్గురు, టీజేఎస్ కౌన్సిలర్ చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా సంతకాలు చేసి కలెక్టర్‌కు సమర్పించారు. దీంతో చైర్‌పర్సన్ స్వప్నకు పదవీగండం తప్పేలాలేదు.



కలెక్టరేట్ ఎదుట తాండూరు వైస్ చైర్‌పర్సన్ దీపానర్సింహులు, కౌన్సిలర్లు



కొడంగల్ రూరల్: మాడ వీధుల్లో సూర్యప్రభ వాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు

నమో.. సూర్యదేవా

రథసప్తమి వేడుకలు జిల్లాలో అత్యంత వైభవోపేతంగా జరిగాయి. అనంతగిరిలో అనంతపద్మనాభ స్వామి, కొడంగల్‌లోని శ్రీమహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి, బుగ్గలోని రామలింగేశ్వరస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యప్రభ, చిన్నశేష, గరుడ, హనుమంత కల్పవృక్ష, సర్వ భూపాల, చంద్రప్రభ వాహనాలపై స్వామివార్ల ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లకు మంగళహారతులు అందిస్తూ దర్శించుకున్నారు.



అనంతగిరి: గరుడ వాహనంపై అనంతపద్మనాభుడు

16 కత్తిపోట్లు

- నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిపై దుండగుల దాడి
- పాత కక్షలే కారణమా?

పరిగి: ఓ వ్యక్తిపై కత్తులతో విచక్షణరహితంగా దాడి చేసిన ఘటన పరిగి పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని చిగురాల్‌పల్లికి చెందిన హరిదాస్‌పల్లి పెంటయ్య శనివారం రాత్రి పరిగి మార్కెట్ యార్డు నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఒక్క సారిగా బైక్‌పై నుంచి వచ్చిన ఆగంతకులు కత్తులతో దాడి చేసి పారిపోయారు. స్థానికులు గమనించి పెంటయ్యను పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పెంటయ్య ఒంటిపై 16 కత్తిపోట్లు ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం నగరానికి తరలించారు. పాత కక్షలతోనే దాడి చేసి ఉంటారని కుటుంబీకులు, పోలీసులు అనుమానిస్తున్నారు. గతంలో హత్యాయత్నం కేసులో పెంటయ్య జైలుకు వెళ్లి వచ్చి రెండు నెలలే అవుతుందని, వారే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు.



చికిత్స పొందుతున్న పెంటయ్య

బాలికలపై వివక్ష తగదు

ఇబ్రహీంపట్నం: బాలికలపై వివక్ష చూపొద్దని, అన్ని రంగాల్లో వారికి సమాన అవకాశాలు కల్పించాలని స్థానిక కోర్టు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఇందిర అన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇబ్రహీం పట్నంలోని ఆశ్రిత మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో లింగ వివక్ష ఇప్పటికీ కొనసాగుతోందని, ఇది ఎంతమాత్రం సరైనది కాదని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రుల అనుమతులు రద్దు చేస్తామని, భ్రూణ హత్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో రాణించాలని మహిళలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐ రామకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదన్న, ప్రధాన కార్యదర్శి రవికిరణ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

'స్పౌజ్' బాటనే అధికం!

- మూడు రోజుల్లో 25 మంది ఉపాధ్యాయులు బదిలీ

వికారాబాద్ అర్బన్: హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల నుంచి 317 జీఓపై వికారాబాద్‌కు వచ్చిన ఉపాధ్యాయులు అత్యధికంగా స్పౌజ్ అవకాశాన్ని వినియోగించుకుంటున్నారు. మూడు రోజుల్లో జిల్లా నుంచి 25 మంది ఉపాధ్యాయులు స్పౌజ్ కింద బదిలీ అయ్యారు. హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల నుంచి వికారాబాద్‌కు ఒక్కరు కూడా రాకపోవడం గమనార్హం. మరో మూడు రోజుల పాటు స్పౌజ్ బదిలీలకు అవకాశం ఉండటంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి కొందరు ఉపాధ్యాయులు నేరుగా బదిలీ ఆర్డర్ తెచ్చుకొని జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లారు. బదిలీ ఆర్డర్ తెచ్చుకుంటున్నట్లు కనీసం జిల్లా విద్యాశాఖ అధికారులకు కూడా సమాచారం లేకపోవడం గమనర్హం. ఉన్నతాధికారులు బదిలీ ఆర్డర్ ఇవ్వడంతో జిల్లా అధికారులు గత్యంతరం లేక రిలీవ్ చేస్తున్నారు. ఇలా ఈ మూడు రోజుల్లో జిల్లా నుంచి ఎనిమిది మంది ఉపాధ్యాయులు ప్రత్యేక ఆర్డర్‌తో వెళ్లినట్లు సమాచారం. ఇప్పటికే ఖాళీలను చూపించడంతో స్పౌజ్‌లో వెళ్లిన ఉపాధ్యాయుల ఖాళీలను, ప్రభుత్వ ప్రత్యేక ఆర్డర్‌తో వెళ్లిన ఖాళీలను ఎలా చూపిస్తారని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు, తాండూరు, పరిగి వంటి పట్టణాల్లో కొన్ని సబ్జెక్టుల ఖాళీలను విద్యాశాఖ అధికారులు బ్లాక్ చేయాలనే ఆలోచన కూడా చేస్తున్నట్లు సమాచారం. ఇలా బ్లాక్ చేస్తే చాలా మంది ఉపాధ్యాయులకు అన్యాయం జరిగే అవకాశం ఉంది. బ్లాక్ చేసిన ఖాళీలను బదిలీల అనంతరం ఉపాధ్యాయ సంఘాల నాయకులకు లేక రాజకీయంగా పలుకుబడి ఉన్నవారికి కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారాన్ని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తుండగా, కొన్ని ఉపాధ్యాయ సంఘాలు మౌనంగా ఉన్నాయి. ఏదిఏమైనా ఖాళీ పోస్టులను బ్లాక్ చేస్తే కొత్త సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉందనే అభిప్రాయం ఉపాధ్యాయుల నుంచి వ్యక్త మవుతోంది.

బీజేపీని బలోపేతం చేస్తాం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, చిత్రంలో విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

- గ్రామగ్రామాన పార్టీని పటిష్టపరుస్తాం
- మాజీ ఎంపీలు జితేందర్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి

నవాబ్‌పేట్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం తథ్యమని, తెలంగాణాలో బీజేపీకి తిరుగేలేదని మాజీ ఎంపీలు జితేందర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు ముఖ్య అతిథిలుగా పాల్గొని మాట్లాడారు. చేవెళ్ల నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ఇదివరకే పార్టీ అనుబంధ శాఖల కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. నవాబ్‌పేటలో కూడా కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు చే స్తున్నామన్నారు. త్వరలోనే బూత్‌స్థాయితో మొదలుకొని అన్ని కమిటీలను వేస్తామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు, కార్యకర్తల అభిప్రాయం మేరకే టికెట్లు కేటాయిస్తారన్నారు. కార్యకర్తలందరూ సైనికుల్లా పని చేసి పార్టీ నిలబెట్టిన అభ్యర్థిని గెలిపించాలని సూచించారు. కొంతమంది కార్యకర్తలు మధ్యలో మాట్లాడుతూ పార్టీలో తమకు ప్రాధాన్యత ఇవ్వడంలేదంటూ వారి దృష్టికి తీసుకొచ్చారు. ఒకే వర్గానికి ప్రాధాన్యత ఇస్తున్నారని ఆందోళనకు దిగారు. స్పందించిన జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో అందరికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అనవసరంగా రాద్ధాంతం చేస్తే ఊరుకునేదిలేదన్నారు. దీంతో సమస్య సద్దుమణిగింది. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందారెడ్డి, నియోజకవర్గ సీనియర్ నాయకులు కంజర్ల ప్రకాశ్, జిల్లా నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, వివిధ అనుబంధ కమిటీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయండి

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి
- ఏబీవీపీ నాయకుల డిమాండ్
- తాండూరులో ధర్నా

తాండూరు టౌన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, తక్షణం స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తాండూరు అంబేడ్కర్ చౌక్‌లో భారీ ధర్నా చేపట్టారు. సమస్యలపై ప్లకార్డులను ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున విద్యార్థులు, ఏబీవీపీ కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించారు. దీంతో వాహనాలు ఎక్కడికక్కడా నిలిచిపోయాయి. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మౌనేశ్వర్‌చారి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడిచినా విద్యా రంగంలోని సమస్యలను పరిష్కరించకపోవడం దారుణమన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.3,800 కోట్ల స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు రాకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారన్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, యూనివర్సిటీల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. స్టాఫ్, నాన్ స్టాఫ్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఇంటర్మీడియెట్ అఫిలియేషన్ విషయంలో గందరగోళం నెలకొనడంతో సుమారు లక్ష మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని, మౌలిక సదుపాయాలను కల్పించాలని అన్నారు. ఈ ధర్నాలో జిల్లా కన్వీనర్ రాజేష్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నవీన్‌గౌడ్, కార్యకర్తలు రాఘవేందర్, అజయ్, శివకుమార్, పవన్‌చారి, ఆదిత్య పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



తాండూరు పట్టణంలోని ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

క్లుప్తంగా

బంజారాలకు ఆదర్శం సంత్ సేవాలాల్

బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్



భూమిపూజ చేస్తున్న మారుతి కిరణ్

దోమ: సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారాలకు మార్గదర్శి అని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని బడేంపల్లి తండాలో సంత్ సేవాలాల్ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మారుతికిరణ్ మాట్లాడుతూ.. బంజార జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు సేవాలాల్ మహారాజ్ అన్నారు. ఆయన ఆశయ సాధనకు గిరిజనులందరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోత్కూర్ సర్పంచ్ కేశవులు, బీజేపీ నేతలు కేశవులు, మల్లేశ్, నరేశ్, రాములు, తండా వాసులు తదితరులు పాల్గొన్నారు.

శివ దీక్ష.. భక్తులకు రక్ష

డీసీసీబీ ఛైర్మన్ మనోహర్‌రెడ్డి



జ్యోతిర్లింగ మహా పడిపూజలో పాల్గొన్న మనోహర్ రెడ్డి

కుల్కచర్ల: శివ దీక్ష భక్తులకు రక్షగా ఉంటుందని డీసీసీబీ ఛైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో మల్లికార్జున సేవా సమితి ఆధ్వర్యంలో శివస్వాముల జ్యోతిర్లింగ మహాపడిపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలని అన్నారు. అనంతరం మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున సేవా సమితి అధ్యక్షుడు చెన్నయ్య గురుస్వామి, రాఘవేందర్ గురుస్వామి, ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు రాందాస్ నాయక్, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీసీఐలో ప్రమాదం

ముగ్గురు కార్మికులకు గాయాలు




ప్రమాదంలో గాయపడిన కార్మికులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్ శివారులో ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఫ్యాక్టరీలో శనివారం ప్రమాదం చోటు చేసుకుంది. ఇద్దరు పర్మినెంట్ ఉద్యోగులతో పాటు ఒక కాంట్రాక్ట్ ఉద్యోగికి గాయాలయ్యాయి. వివరాల ప్రకారం.. సీసీఐ ఫ్యాక్టరీల్లో ఇనుస్ట్రుమెంటేషన్ విభాగంలో జీ.నవీన్ కుమార్(జూనియర్ ఇంజనీర్) ,పి.చంద్రశేఖర్ (టెక్నీషియన్)తో పాటు కాంట్రాక్టు ఉద్యోగి సునీల్‌కుమార్ (హెల్పర్) పని చేస్తున్నారు. సిమెంట్ ముడి సరుకు తయారు చేసే ప్రీ హీటర్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ప్రీహీటర్ నుంచి వెలువడిన వేడిగా ఉన్న పౌడర్ కార్మికులకు పడింది. దీంతో గాయపడిన కార్మికులను వెంటనే తాండూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నవీన్‌కుమార్, చంద్రశేఖర్‌ను హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆస్పత్రికి, సునీల్‌ను కర్ణాటకలోని గుల్బర్గా ఈఎస్‌ఐ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం చోటు చేసుకోవడంతో కార్మికులంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.



అనంతగిరి: ముత్యాలపందిరి వాహనంపై ఊరేగుతున్న అనంతపద్మనాభుడు



అనంతగిరి: బుగ్గ సూర్యదేవాలయంలో..



తాండూరు రూరల్: శేష వాహనంపై వేంకటేశ్వరస్వామి

వైభవోపేతంగా రథసప్తమి

● ఒకే రోజు ఏడు వాహనాలపై స్వామివారి ఊరేగింపు ● మార్మోగిన గోవింద నామస్మరణ

అనంతగిరి/కొడంగల్‌రూరల్/తాండూరు రూరల్: అనంతగిరి పద్మనాభ స్వామి ఆలయంలో, బుగ్గ రామలింగేశ్వరాలయంలో కొలువుదీరిన సూర్యదేవాలయంలో, కొడంగల్‌లోని మహాలక్ష్మి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో, తాండూరు మండల పరిధిలోని అంతారం అనుబంధ గ్రామం దస్తగిరిపేట(చంద్రగిరి)లోని శ్రీదేవి, భూమదేవి సమేత వేంకటేశ్వరాలయంలో ప్రతీ ఏట మాఘ శుద్ధ సప్తమినాడు రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. రథసప్తమి సందర్భంగా ఆలయ ధర్మకర్తలు, పురోహితులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని ఏడు వాహనాలపై మాడ వీధుల్లో ఊరేగించారు. రథసప్తమి సందర్భంగా స్వామివారు సూర్యప్రభ, చిన్న శేష, గరుడ, హనుమ, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.



కొడంగల్ రూరల్: సుగంధ ద్రవ్యాలతో స్వామివారికి అభిషేకం

యువత ఉన్నతంగా రాణించాలి

వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్ అర్బన్: యువత ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉన్నతంగా రాణించాలని, నిరుద్యోగులు నైపుణ్యం పెంపొందించుకుని ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. శనివారం జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ మేళాలో 60 కంపెనీలు పాల్గొన్నాయి. 1,728 మంది నిరుద్యోగులు మేళాకు హాజరవ్వగా 672మంది ఉద్యోగావకాశాలు లభించాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, జెడ్పీ వైస్ ఛైర్మన్ విజయ్ కుమార్, యువజన క్రీడల అధికారి హన్మంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రత్నమ్మ మరణం పార్టీకి తీరని లోటు

ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

పెద్దేముల్: బీఆర్ఎస్ మహిళ మండల మాజీ అధ్యక్షురాలు ఎర్ర రత్నమ్మ మరణం పార్టీకి తీరని లోటని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రత్నమ్మ మరణ వార్త తెలుసుకున్న పలువురు నాయకులు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళి అర్పించిన వారిలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, కోట్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ బుజ్జమ్మ, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు దాసరి నర్సింలు, మారేపల్లి సర్పంచ్ బలవంతురెడ్డి, మాజీ సర్పంచ్‌లు ప్రకాశం, బాలప్ప, మండల యువ నాయకుడు మహిపాల్‌రెడ్డి, ఆజం ఖాన్, కుమ్మరి విఠల్ తదితరులు ఉన్నారు.



రత్నమ్మ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

పరామర్శ

తాండూరు రూరల్: మండల పరిధిలోని చిట్టిఘనాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బసిరెడ్డి తల్లి అమృతమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి శనివారం గ్రామానికి వెళ్లి బసిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట నాయకులు శ్రీను, ప్రభాకర్‌రెడ్డి, వెంకటప్ప, శేఖర్ ఉన్నారు.

బకాయిలు చెల్లించకుంటే భూములు వేలం

సీఈఓ రాజమౌళి

పెద్దేముల్: బ్యాంకులో పంట రుణాలు తీసుకుని చెల్లించని రైతుల భూములను వేలం వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసామని తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం సీఈఓ రాజమౌళి అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని రచ్చకట్టతండా, జైరాంతండా, ఓంలానాయక్‌తండాతో పాటు పలు గ్రామాల్లో మొండి బకాయిలున్న రైతులకు నోటీసులు అందజేసామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 31వరకు బకాయిలు చెల్లించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది పంట రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో వడ్డీలు చెల్లించి రెన్యూవల్ చేసుకుని కొత్త రుణాలు పొందాలని సూచించారు. మొండి బకాయి రైతులకు



రైతుకు నోటీసు ఇస్తున్న సీఈఓ రాజమౌళి

ఇప్పటి వరకు మూడు సార్లు డిమాండ్ నోటీసులు ఇచ్చామని. 2022 డిసెంబర్ వరకు అప్పు చెల్లించని రైతులకు 8-9 ల్యాండ్ యాక్షన్ చివరి నోటీసును అందచేయగా సుమారు తొమ్మిది మంది రైతులు బకాయిలు చెల్లించారని చెప్పారు. మిగిలిన 13మంది రైతులు సుమారు రూ.22లక్షలు బకాయి చెల్లించాల్సి ఉందన్నారు. ఈ రైతులు జనవరి చివరి వరకు చెల్లించాలని లేదా వారి భూములను వేలం వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని వివరించారు. సంఘం పరిధిలో మెత్తం 2,100 మంది సభ్యులుండగా ఇప్పటి వరకు సుమారు 800మంది రైతులకు సుమారు రూ.10కోట్లకు పైగా పంట రుణాలు అందజేశామన్నారు. స్వల్పకాలిక రుణాల కింద రూ.9కోట్లు, దీర్ఘకాలిక రుణాల కింద రూ.1.40కోట్లు రుణాలు అందజేశామన్నారు. మార్చి వరకు గతేడాది రుణాలు తీసుకున్న రైతులు వడ్డీలు చెల్లించి కొత్త రుణాలు పొందాలన్నారు. జిల్లా అధికారుల సహకారంతో గ్రూపులుగా ఏర్పడి రుణాలు వసూళ్లు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు తట్టెపల్లి ప్రాథమిక సహకార సంఘంలో 30శాతం రికవరీ చేశామని, మిగిలిన 70శాతం మార్చి వరకు పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇందుకు రైతులు సహకరించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో సర్పంచ్ మృతి

● శోక సంద్రంలో కుటుంబం, గ్రామస్తులు
● అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనంద్



వీరేశం, సర్పంచ్, కుక్కింద (ఫైల్)

ధారూరు: రోడ్డు ప్రమాదంలో సర్పంచ్ మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి ధారూరు పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేందర్ తెలిపిన ప్రకారం.. బీఆర్ఎస్‌కు చెందిన కుక్కింద సర్పంచ్ వీరేశం(48) శుక్రవారం గ్రామస్తులతో కలిసి ఫిబ్రవరి 5న గ్రామ దేవత మైసమ్మకు బోనాల ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్ణయించారు. అనంతరం ఆయన రాత్రి 9గంటల సమయంలో బైక్‌పై స్వగ్రామం నుంచి ధారూరు వెళ్తున్నారు. ఈ క్రమంలో అంగడి చింతచెట్టు సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి కిందపడి తలకు బలమైన గాయాలయ్యి అక్కడే పడిపోయాడు. సమీపంలోని ఓ ఫంక్షన్ హాలు నుంచి వస్తున్న టీఆర్ఎస్ నాయకులు క్షతగాత్రుడిని గమనించి చికిత్స నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతుడికి భార్య కవిత,



వీరేశం పాడె మోస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్

కొడుకు శశికిరణ్ నారాయణ కళాశాలలో బీటెక్ చేస్తుండగా, కూతురు అఖిల సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని శశికిరణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అడవి పంది ఢీకొట్టడంతోనే ప్రమాదం..?

రోడ్డు దాటుతున్న అడవిపందిని వీరేశం బైక్ ఢీకొట్టడంతోనే ప్రమాదం జరిగినట్లు సమాచారం. తలకు హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాపాయం తప్పేదని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. అనంతరం ఆయన సర్పంచ్ అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోసారు. అంత్యక్రియల్లో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ధారూరు అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం మధ్యాహ్నం బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు వీరేశం చిత్రపటానికి నివాళి అర్పించారు. సంతాప సభలో జెడ్పీ వైస్ ఛైర్మన్ విజయకుమార్ పాల్గొన్నారు.

31వరకు సభ్యత్వ నమోదుకు అవకాశం

తాండూరు: తాండూరు లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 31వరకు కొనసాగుతుందని అసోసియేషన్ ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నెల రోజులుగా నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఇప్పటి వరకు 200మంది లారీ ఓనర్లు సభ్యత్వం తీసుకున్నారని చెప్పారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్



యాలాల: కాగ్నా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను యాలాల పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ అరవింద్‌కుమార్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కోకట్ కాగ్నా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. పట్టుబడిన వాహనాలు తాండూరు మండలం అంతారం గ్రామానికి చెందిన రాజు, మరొక ట్రాక్టరు కోకట్ గ్రామానికి చెందిన సూరప్పదిగా గుర్తించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు ట్రాక్టర్లను సీజ్‌చేసి యజమానులపై కేసు నమోదు చేశామన్నారు.

దశల వారీగా సమస్యల పరిష్కారం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: గ్రామాల్లోని సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే దశల వారీగా పరిష్కరిస్తామని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో రూ.5లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందన్నారు. గ్రామాల అభివృద్ధిలో పార్టీలకు అతీతంగా ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. ప్రజల సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి చేసేందుకు వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, మున్సిపల్ ఛైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ భాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, రవి కుమార్, కిరణ్, రామకృష్ణారెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. దోమ మండల పరిధిలోని మోత్కూరు గ్రామానికి చెందిన ఏడుగురు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దోమ జెడ్పీటీసీ సభ్యుడు నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ మల్లేశం, గ్రామస్తులు ఆనంద్, నందయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే రోజు.. ఆరుగురి బలవన్మరణం

ఆత్మహత్యలు వద్దు.. నిండు జీవితాలే ముద్దు అని ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నా చిన్న చిన్న సమస్యల కారణంగా క్షణికావేశంతో ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. రంగారెడ్డి జిల్లా పరిధిలో ఒకే రోజు నలుగురు బలవన్మరణాలకు పాల్పడడం కలిచివేస్తుంది. మృతులంతా 40 ఏళ్ల లోపు వారే కావడం విచారం.

● భర్త వివాహేతర సంబంధం కారణంగా వివాహిత
● భార్యతో గొడవపడి వాచ్‌మెన్
● అప్పులబాధతో ప్రైవేటు ఉద్యోగి
● అనారోగ్య సమస్యతో కానిస్టేబుల్

షాద్‌నగర్‌రూరల్: భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని మనస్తాపానికి గురైవివాహిత ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తన కూతురు మరణానికి అల్లుడే కారణమని మృతురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చౌలపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని ఇంద్రానగర్‌కాలనీకి చెందిన నందిని(25)కి ఫరూఖ్‌నగర్ మండలం చౌలపల్లి గ్రామానికి చెందిన పెద్దబాయి మహేశ్‌తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. మహేష్ రాజాపూర్ మండల పరిధిలోని అరబిందో ఫార్మా కంపెనీలో లేబర్ వర్కర్‌గా పని చేస్తుండగా నందిని ఇంటి వద్దనే ఉంటుంది. కొంతకాలం వీరి కాపురం సజావుగానే సాగింది. వీరికి సంజయ్(18నెలలు), మణి(10 నెలలు) ఇద్దరు సంతానం. ఈ క్రమంలో మహేష్ రాజాపూర్ మండలం ఈద్గానిపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయంలో కొన్నాళ్లుగా భార్యాభర్తల మధ్య



షాద్‌నగర్‌రూరల్: భర్తతో నందిని(ఫైల్)

గొడవలు జరగడంతో కుటుంబ సభ్యులు, బంధువులు సర్ది చెప్పారు. అయినప్పటికీ భర్త తీరులో మార్పు రాకపోవడంతో భార్య ప్రశ్నించడంతో ఆమెను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. శుక్రవారం రాత్రి మరోసారి దంపతులు గొడవ పడ్డారు. పుట్టింటికి ఫోన్ చేసి మహేశ్ నన్ను కొడుతున్నాడని.. చనిపొమ్మని వేధిస్తున్నాడని చెప్పింది. భర్త వేధింపులు భరించలేకే నందిని ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. నా కూతురు మరణానికి అల్లుడు మహేశ్ కారణమని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతురాలి తల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

కర్ణాటక రాష్ట్రానికి చెందిన వాచ్‌మెన్

చేవెళ్ల: భార్యతో గొడవపడిన ఓ వాచ్‌మెన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం మండల పరిధిలోని ముడిమ్యాల గ్రామంలోని ఓ ఫాంహౌస్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన తాయబ్(30) బతుకుదెరువు నిమిత్తం రెండేళ్ల క్రితం ముడిమ్యాలలోని ఓ ఫాంహౌస్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆ ఫాంహౌస్‌లోనే భార్యాభర్తలు నివాసం ఉంటున్నారు. శనివారం దంపతుల మధ్య గొడవ చోటుచేసుకుంది. దీంతో క్షణికావేశంలో తాయబ్ ఓ



చేవెళ్ల: తాయబ్ మృతదేహం

చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పెళ్లికి అయిన అప్పులు తీర్చలేక..

యాచారం: అప్పుల బాధతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యాచారం సీఐ లింగయ్య తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన బండ లక్ష్మయ్య(30) నగరంలో ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈయనకు 2022 డిసెంబర్ 11న అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొహెడ గ్రామానికి చెందిన వరలక్ష్మితో వివాహమైంది. పెళ్లి ఖర్చుకు అప్పు ఇచ్చిన వారు తిరిగి ఇవ్వాలని ఇటీవల ఒత్తిడి పెంచారు. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మయ్య శనివారం ఉదయం గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక కానిస్టేబుల్ ..

కడుపునొప్పి భరించలేక ఓ కానిస్టేబుల్ ఇంట్లోనే ఊరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ లింగయ్య తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ధర్మన్నగూడెంకు చెందిన అనుమండ్ల శ్రీనివాస్(35) కీసర పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. శ్రీనివాస్‌కు శనివారం ఉదయం తీవ్రమైన కడుపునొప్పిరావడంతో తన ఇంట్లోనే ఊరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య స్వాతి, కూతురు, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రాజీవ్‌గృహకల్పలో ప్రేమ జంట..

ఇబ్రహీంపట్నం రూరల్: సహజీవనం చేస్తున్న ప్రేమజంట అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన ఆదిబట్ల పీఎస్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఆదిబట్ల సీఐ రవికుమార్ తెలిపిన ప్రకారం.. కుర్మల్‌గూడ రాజీవ్‌గృహకల్పలో నివాసం ఉండే నిదానకవి సరస్వతి(30)తో శివకు వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు సంతానం. పిల్లలు హాస్టల్లో చదువుకుంటారు. సరస్వతి భర్త ఐదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆమెకు ఇటీవల సాదుల మహేందర్(21)తో పరిచయం ఏర్పడి రాజీవ్ గృహకల్పలో సహజీవనం చేస్తున్నారు. ఈ నెల 27న మహేందర్ తల్లి లక్ష్మి, సోదరి ఇద్దరూ కూలీ పనికి వెళ్లారు. 28న ఇంటికి



సరస్వతి మృతదేహం

వచ్చే చూసేవరకు ఉరేసుకున్న మహేందర్, నేలపై పడి ఉన్న సరస్వతి మృతదేహాలను గుర్తించారు. దీంతో ఆదిబట్ల పోలీసులకు సమాచారం ఇచ్చారు. సరస్వతి మెడపై నల్లటి మచ్చలుండడంతో ముందుగా ఆమెను చంపిన మహేందర్ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. హత్య..? ఆత్మహత్యా..? అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సరస్వతి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రవి కుమార్ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

పోలీసు అభ్యర్థులకు న్యాయం చేయండి

ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు నందకిశోర్

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పోలీసు ఉద్యోగాల నియామకాల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించి అభ్యర్థులకు న్యాయం చేయాలని ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు నందకిశోర్ కోరాడు. ఈ మేరకు ఆయన శనివారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నందకిశోర్ మాట్లాడుతూ.. ఎస్‌ఐ, కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో భాగంగా లాంగ్‌జంప్‌లో జరిగిన అవకతవకలపై వెంటనే విచారణ జరిపించి పోలీసులు అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి సమ్యను తీసుకెళ్లాలని ఎమ్మెల్యేకు విన్నవించారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం చెరువులో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని శనివారం గుర్తించారు. స్థానిక సీఐ రామకృష్ణ తెలిపిన ప్రకారం.. సుమారు 30ఏళ్ల వయస్సున్న మహిళ పింకు, ఎరుపు రంగు దుస్తులు, చెవులకు రోల్డ్ గోల్డ్ రింగులు ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహం నీటిపై తేలియాడుతుండడంతో రెండు రోజుల క్రితమే చెరువులో పడినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. మహిళ ఆచూకీ తెలిసినవారు 8333993279 నెంబర్‌కు కాల్ చేసి సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

మాతృభాషను మర్చిపోవద్దు
మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



ఎన్‌సీసీ కేడెట్ల గౌరవ వందనం స్వీకరిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

నిజాంపేట్: మాతృదేశాన్ని, మాతృమూర్తిని, మాతృ భాషను మరిచిపోయిన వాడు మనిషికాడని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు అన్నారు. శనివారం బాచుపల్లిలోని వీఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి పాఠశాల 27వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు, క్వెస్టియన్ ట్రూప్ విద్యార్థులు మాజీ ఉపరాష్ట్రపతికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక, నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అదే విధంగా చదువు, ఆటలు, సంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం వెంకయ్యనాయుడు మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని అభిలాషించారు. ఇండియన్ ఆర్మీ 7(టీ) గరల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రంజిత్ చాకో, స్కూల్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వల్లూరిపల్లి రాజా రాంమోహన్‌రావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్
- ట్రిపుల్‌డ్రైవింగ్ చేసిన 24వేల మందిపై కేసులు

హిమాయత్‌నగర్: నగరంలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడుతున్న వారిపై భారీ స్థాయిలో కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ అడిషనల్ కమీషనర్ జి.సుధీర్ బాబు తెలిపారు. గత ఏడాది నవంబర్ 28వ తేదీ నుంచి ఇప్పటి వరకు మూడు కేటగిరీల్లో తాము ప్రత్యేక డ్రైవ్ చేసి కేసులు నమోదు చేశామన్నారు. వీటిలో గత ఏడాది నవంబర్ 28వ తేదీ నుంచి చేపట్టిన డ్రైవ్‌లో ట్రిబుల్ రైడింగ్ చేస్తున్న 24,658, రాంగ్‌సైడ్ డ్రైవ్ చేస్తున్న 1లక్షా 30వేల 311మందిపై కేసులు నమోదైనట్లు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా ఆర్టీసీ బస్సులు, హెవీ వెహికల్స్‌పై ప్రత్యేక డ్రైవ్‌లో భారీగా కేసులు నమోదు అయ్యాయి. ఆర్టీసీ బస్సులపై 3892, హెవీ వెహికల్స్‌పై 5806 కేసులను ఈనెల 4వ తేదీ నుంచి ఇప్పటి వరకు నమోదు చేసినట్లు చెప్పారు. గత ఏడాది సెప్టెంబర్ 15న ప్రారంభించిన ఆపరేషన్ రోప్‌లో భాగంగా అనేక కేటగిరిల్లో కేసులు నమోదయ్యాయి. ఫ్రీలెఫ్ట్ బ్లాక్ చేసిన 32వేల 64మందిపై, స్టాప్ లైన్‌ను క్రాసైన 2లక్షల 13వేల 77 మందిపై, రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న 200మందిపై, ఫుట్‌పాత్ ఆక్రమించిన 12వేల 946మందిపై, రోడ్డుపై అక్రమంగా పార్కింగ్(టోవింగ్) చేసిన 53వేల 424మందిపై, రాంగ్ రూట్ చేసిన 1లక్షా 32వేల 531మందిపై, సిటీలోకి చొరబడిన ఇతర ప్రాంతాలకు చెందిన ఆటోవాల 3వేల 16మందిపై, బస్సులు, లారీలు 63మందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

4,5 తేదీల్లో ఖురాన్ పారాయణ పోటీలు
సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రస్థాయి ఖురాన్ పారాయణ పోటీలు వచ్చే నెల 4, 5 తేదీల్లో నిర్వహిస్తున్నామని, ఆసక్తిగల వారు ఈ నెల 31 తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని షరిఫియా ఖిరాత్ అకాడమి డైరెక్టర్ హఫెజ్ ఖారీ డాక్టర్ మహ్మద్ నసీరుద్దీ మన్షీ శనివారం తెలిపారు. గ్రూప్-ఏలో 7-15 ఏళ్ల వరకు, గ్రూప్- బీలో 16-30 ఏళ్ల వయసున్న వారు అర్హులన్నారు. మలక్‌పేట్‌లోని ఆఫీసర్స్ మెస్‌లో పోటీలు నిర్వహిస్తామన్నారు. మొదటి బహుమతిగా రూ.10వేలు, రెండవ బహుమతిగా రూ.7వేలు, మూడో బహుమతిగా రూ.5వేలు అందజేస్తామన్నారు. వివరాలకు 9849024785 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

పార్ట్ టైం జాబ్ పేరుతో లూటీ
యువకుడి నుంచి రూ.12 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: పార్ట్‌టైం జాబ్ పేరుతో నగర వాసిని నిండా ముంచాడో సైబర్ నేరగాడు. జాబ్ కోసం సంప్రదించి టాస్క్‌లు ఇచ్చి మరీ లక్షల రూపాయిలు దోచుకున్నాడు. తనకు ఉద్యోగం ఇవ్వకపోగా మరిన్ని డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో బాధితుడు శనివారం సిటీ సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాంనగర్ గుండుకు చెందిన బ్యాంకు ఉద్యోగి ఫోన్ నంబర్‌ను టెలిగ్రామ్ గ్రూప్‌లో ఓ వ్యక్తి యాడ్ చేశాడు. పార్ట్‌టైం జాబ్ ఇస్తానని తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించొచ్చని ఆశ పెట్టాడు. తొలుత రూ.3వేలుకు సంబంధించిన టాస్క్ ఇచ్చాడు, అది పూర్తి చేసిన ఉద్యోగికి లాభాలు ఇచ్చాడు. ఆ తర్వాత టాస్క్‌లు పేరుతో రూ.12లక్షల మేర దోచుకున్నాడు. ఒక్క రూపాయి లాభం ఇవ్వకపోగా మరిన్ని డబ్బు అడగడంతో బాధితుడు సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

- బంజారాహిల్స్‌కు చెందిన ఓ యువకుడికి ప్రైవేటు ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఫేస్‌బుక్ వేదికగా మోసానికి పాల్పడ్డాడో సైబర్ నేరగాడు. బ్యాక్ డోర్‌లో ఉద్యోగానికి కొంత ఖర్చు పెట్టుకోవాలని సూచించాడు. దీంతో నగర వాసి పలు దఫాలుగా రూ.5లక్షలు సమర్పించాడు. ఉద్యోగం ఇవ్వకపోగా ఇచ్చిన డబ్బును కూడా వెనక్కి ఇవ్వకపోవడంతో బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ గ్యారెంటీ పత్రాలతో బురిడీ

- కోల్‌కత్తా కేంద్రంగా నడుస్తున్న ముఠా గుట్టు రట్టు
- రూ.45కోట్ల విలువైన నకిలీ బ్యాంక్ గ్యారెంటీ పత్రాలు
- వివరాలు వెల్లడించిన సీసీఎస్ అడిషినల్ డీసీపీ స్నేహమెహ్రా



వివరాలు వెల్లడిస్తున్న హైదరాబాద్ సీసీఎస్ అడిషనల్ డీసీపీ స్నేహ మెహ్రా

హిమాయత్‌నగర్: బ్యాంక్ గ్యారెంటీ పత్రాలు నకిలీవి సృష్టించి కంపెనీలను మోసం చేస్తున్న ముఠా గుట్టును హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు రట్టు చేశారు. కలకత్తా కేంద్రంగా జరుగుతున్న ఈ తతంగాన్ని బట్టబయలు చేసిన పోలీసులు నలుగురు వ్యక్తుల్ని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.45 కోట్ల విలువైన 60 నకిలీ బ్యాంక్ పత్రాలను, ఐదు సెల్‌ఫోన్‌లను, రెండు చెక్కులను స్వాధీనం చేసుకున్నట్లు సీసీఎస్ అడిషినల్ డీసీపీ స్నేహమెహ్రా తెలిపారు. ఈ వ్యవహారంలో వరంగల్‌కు చెందిన అడ్వకేట్, లోన్ ఏజెంట్ గోడిశాల నాగరాజు సూత్రధారిగా ఉన్నట్లు వివరించారు. శనివారం బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ సీపీ కార్యాలయంలో ఏసీపీలు మోహన్‌కుమార్, పూర్ణచంద్రరావు, ఇన్‌స్పెక్టర్లు ప్రసాదరావు, మట్టయ్యలతో కలిసి వివరాలను వెల్లడించారు.

నకిలీ గ్యారెంటీ పత్రాలతో దందా

కొద్దిరోజుల క్రితం చెన్నైకి చెందిన హర్షిత ఇన్‌ఫ్రా ఇంజనీరింగ్ కంపెనీకి బ్యాంక్ గ్యారెంటీ పత్రాలను అందిస్తానంటూ వరంగల్‌కు చెందిన అడ్వకేట్ గోడిశాల నాగరాజు కంపెనీ ఎండీ ప్రజ్వల్ కరుణ్‌కు పరిచయమయ్యాడు. కొంతకాలంగా దేశవ్యాప్తంగా పలు కంపెనీలకు బ్యాంక్ గ్యారెంటీ నకిలీ పత్రాలను తయారు చేసే కల్‌కత్తాకు చెందిన నిలోట్‌పాల్ దాస్(56). సుబ్రజిత్ గోశాల్(31)లతో రాజస్థాన్‌కు చెందిన నరేష్ శర్మ ద్వారా గోడిశాల నాగరాజుకు వీరితో పరిచయం ఏర్పడింది. ఈ నలుగురూ కలసి గతంలో అనేక బ్యాంకులకు బ్యాంక్ గ్యారెంటీ పత్రాలు నకిలీవి అందచేశారు. ఇదేక్రమంలో కోల్‌కత్తాలోని ఇండస్‌లండ్ బ్యాంక్ నుంచి బ్యాంక్ గ్యారెంటీ పత్రాలను కంపెనీ ఎండీ ప్రజ్వల్ కరుణకు నాగరాజు అందచేశాడు. ఇందుకు గాను కంపెనీ నుంచి నాగరాజు రూ.47లక్షలు ముడుపులు తీసుకున్నాడు. ఈ పత్రాలు నకిలీ, ఒరిజనల్ అనే విషయంలో మాకు స్పష్టత లేదంటూ మునిసిపల్ అర్బన్ డెవలప్‌మెంట్ ముంబయ్‌లోని ఇండస్‌లండ్ బ్యాంక్‌ను మెయిల్ ద్వారా కోరింది. ఆ పత్రాల్లో ఉన్న అడ్రాస్‌లో మా బ్రాంచ్ లేదని వారు మునిసిపల్ అర్బన్ డెవలప్‌మెంట్‌కు రిప్‌లై ఇచ్చారు. దీంతో ఈనెల 4వ తేదీన సైబర్‌క్రైం పోలీసులకు మాసబ్‌ట్యాంక్‌లోని ఇండస్‌లండ్ బ్యాంక్ అధికారులు ఫిర్యాదు చేయడంతో..కేసు నమోదు చేసి ఈ కేసును సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఇదిలా ఉండగా నకలి గ్యారెంటీ పత్రాలు ఇచ్చిన కారణంతో మునిసిపల్ అర్బన్ డెవలప్‌మెంట్ తమ కంపెనీకి చెందిన టెండర్లను రద్దు చేస్తూ, టెర్మినేట్ చేసిందని ఈనెల 14న నారాయణగూడ పోలీసు స్టేషన్‌లో గోడిశాల



నాగరాజుపై కంపెనీ ఎండీ ప్రజ్వల్ కరుణ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కొద్ది రోజుల క్రితం తొలుత గోడిశాల నాగరాజు, రాజస్థాన్‌కు చెందిన నరేష్ శర్మను అదుపులోకి తీసుకుని విచారించగా.. పత్రాలు తయారు చేసేది కల్‌కత్తాకు చెందిన నిలోట్‌పాల్ దాస్, సుబ్రజిత్ గోశాల్‌లు అని చెప్పారు. దీంతో సీసీఎస్ టీం ఆ ఇద్దరినీ అరెస్టు చేసి వారి నంచి రూ.45కోట్ల విలువైన బ్యాంక్ నకిలీ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. నిలోట్‌పాల్ దాస్, సుబ్రజిత్ గోశాల్‌లు గతంలో ఇండియన్ బ్యాంక్, ఇండస్‌లండ్ బ్యాంక్‌లకు చెంది పత్రాలను తయారు చేసి కంపెనీల నుంచి కోట్లాది రూపాయిలు సంపాదించారు. బ్యాంక్‌ల నుంచి వెరిఫికేషన్ వచ్చేలా ఆ పత్రాల్లో వీరికి సంబంధించిన మెయిల్ ఐడీలను పెట్టడం గమనార్హం. ఇంకా వీరిపై ఎక్కడెక్కడ కేసులు ఉన్నాయి, ఎంత వరకు మోసాలు చేశారనే విషయాలపై తాము విచారిస్తున్నట్లు అడిషినల్ డిసిపి స్నేహ మెహ్రా తెలిపారు.

బీసీల బడ్జెట్ రూ.20 వేల కోట్లకు పెంచాలి

విజయనగర్‌కాలనీ: బీసీల బడ్జెట్ రూ.5006 కోట్ల నుండి రూ.20 వేల కోట్లకు పెంచాలని, కళాశాల కోర్సులు చదివే బీసీ, ఏబీసీ ఉద్యోగులకు పూర్తి ఫీజులు మంజూరు చేయాలని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు నీల వెంకటేష్, వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో వేలాదిమంది విద్యార్థులతో శనివారం మాసబ్‌ట్యాంక్‌లోని బీసీ సంక్షేమ భవన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం బీసీల అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తుందని, గత ఐదు సంవత్సర కాలంలో ఒక్కరికి కూడా రుణాలు ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో 295 బీసీ కాలేజీ హాస్టళ్లకు, 321 బీసీ గురుకుల పాఠశాలలకు ఒక్కదానికి కూడా సొంతభవనం లేదన్నారు. విదేశీ విద్య స్టైఫండ్ స్కీమ్ కింద అర్హులందరికి స్టైఫండ్ ఇవ్వడానికి దీని బడ్జెట్‌ను రూ.60 కోట్ల నుంచి రూ.300 కోట్ల వరకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా బీసీ అడ్వకేట్లకు ఇచ్చే స్టైఫండ్ రూ.1000 నుంచి రూ.10 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అర్హులందరికి డీఎస్సీ, పోలీస్, ఎస్ఐ, గ్రూఫ్ 1, 2, 3, 4 సివిల్స్, బ్యాంకింగ్, రైల్వే తదితర పోటీ పరీక్షలకు కోచింగ్ ఇవ్వాలన్నారు. అనంతరం సంబంధిత బీసీ సంక్షేమ శాఖ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో జాతీయ నాయకులు గుజ్జకృష్ణ, సి.రాజేందర్, లాల్ కృష్ణ, అనంతయ్య, భూపేష్‌సాగర్, రాజ్‌కుమార్, మోడీ రామ్‌దేవ్, తిరుపతి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



మాసబ్‌ట్యాంక్ బీసీ సంక్షేమ భవన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్. కృష్ణయ్య తదితరులు

బలవంతంగా వ్యభిచారం
విదేశీ మహిళ అరెస్ట్

బంజారాహిల్స్: హైదరాబాద్‌లో ఉద్యోగం చూపిస్తానని నమ్మించి తీరా ఇక్కడికి వచ్చాక వ్యభిచార వృత్తిలోకి బలవంతంగా దింపుతోందంటూ ఉగాండాకు చెందిన యువతి కెన్యాకు చెందిన మహిళపై చేసిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులకు శనివారం కెన్యా మహిళను అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే... ఉగాండాకు చెందిన యువతి(31) ఉద్యోగం కోసం గాలిస్తుండగా కెన్యాకు చెందిన చెరియట్ శైలిన్ జెష్వా అనే మహిళతో పరిచయం ఏర్పడింది. తాను హైదరాబాద్‌లో ఉద్యోగం ఇప్పిస్తానంటూ గతేడాది డిసెంబర్ 22వ తేదీన టూరిస్ట్ వీసాపై ఇక్కడికి రప్పించింది. బంజారాహిల్స్ రోడ్ నెం.10లోని జహిరానగర్‌లో ఓ ఫ్లాట్ అద్దెకు తీసుకున్న కెన్యా మహిళ ఇందులోనే ఉగాండా యువతిని తనతో పాటు ఉంచుకొని వ్యభిచారం చేయాలంటూ ఒత్తిడి చేయసాగింది. పూర్తిగా తన కంట్రోల్‌లో పెట్టుకొని వ్యభిచారం చేయకపోతే బాగుండదంటూ హెచ్చరికలు జారీ చేసేది. ఇదే విషయాన్ని ఉగాండాకు చెందిన యువతి స్నేహితుడు వాట్సాప్ ద్వారా విషయం తెలుసుకొని ఆమె ఇబ్బందులను గుర్తించి ఈ మేరకు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్ళి అక్కడ నిర్బంధంలో ఉన్న ఉగాండా యువతిని రక్షించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదుమేరకు కెన్యాకు చెందినచెరియట్ శైలిన్ జెష్వాను అరెస్ట్ చేశారు. బాధితురాలిని పునరావాస కేంద్రానికి తరలించారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఏడాది టూరిస్ట్ వీసాతో 2020లో జెష్వా హైదరాబాద్‌కు వచ్చి గత రెండేళ్లగా వీసా గడువు ముగిసిన తర్వాత కూడా నగరంలోనే తిష్టవేసినట్లుగా పోలీసుల దృష్టికి వచ్చింది.

ఓక్రిడ్జ్‌లో సందడిగా కార్నివాల్



కార్నివాల్‌లో పాల్గొన్న మంత్రి సబితారెడ్డి, చిత్రంలో హిమాన్షు తదితరులు

- ఈవెంట్‌ను ప్రారంభించిన మంత్రి సబితాఇంద్రారెడ్డి
- ఆకట్టుకున్న సీఎం మనవడు హిమాన్ష్

రాయదుర్గం: తన నాయకత్వ ప్రతిభతో సీఎం కేసీఆర్ మనుమడు, మంత్రి కేటీఆర్ కుమారుడు హిమాన్షు అందరినీ ఆకట్టుకున్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడలోని ఓక్రిడ్జ్ అంతర్జాతీయ పాఠశాలలో కార్నివాల్ ఈవెంట్‌ను శనివారం నిర్వహించారు. ఈ ఈవెంట్‌ను రాష్ట్ర విద్యాశాఖా మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. క్రియేటివిటీ, ఆక్టివిటీ, సర్వీస్‌థీమ్‌తో కార్నివాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఈవెంట్‌తో వచ్చిన డబ్బుతో నానక్‌రాంగూడ చెరువు సుందరీకరించాలని విద్యార్థులు నిర్ణయించారు. ఈ కార్నివాల్‌కు హెడ్‌గా విద్యార్థి హిమాన్షు వ్యవహరించారు. ఆయన బృందం సృజనాత్మకతను మంత్రి సబితారెడ్డి అభినందించారు. సినీ హీరోలు నిఖిల్, కిరణ్ అబ్బవరంలు సందడి చేశారు. ఈ సందర్భంగా హిమాన్షు బృందం ఏర్పాటు చేసిన స్టాలు, ఇతర విద్యార్థుల స్టాళ్లను హీరోలు, మంత్రి సబితారెడ్డి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు తిలకించి విద్యార్థులను అభినందించారు. అనంతరం మంత్రి సబితా రెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల్లో లాగ ప్రభుత్వ పాఠశాలల్లో కూడా పలు ఇన్నోవేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. నేటి తరం పిల్ల ఆలోచనా విధానానికి ఈ కార్నివాల్ ప్రతీకగా నిలుస్తుందన్నారు.

నుమాయిష్‌పై నజర్..
41మంది పోకిరీలకు జైలు

హిమాయత్‌నగర్: నుమాయిష్ కేంద్రంగా ఈవ్‌టీజింగ్, అసభ్యప్రవర్తనకు పాల్పడుతున్న పోకిరీలపై షీటీం పోలీసులు కన్నెర్ర చేశారు. జనవరి 11వ తేదీన ప్రారంభమైన నుమాయిష్ ఎగ్జిబిషన్‌లో సీపీ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు మఫ్టీలో విధులు చేపట్టారు. పలు రకాల వేధింపులకు పాల్పడుతున్న ఆకతాయిలు 41మందిని గుర్తించి వారిని కోర్టులో హాజరుపరిచినట్లు శనివారం అడిషినల్ సీపీ (క్రైం అండ్ ఉమెన్ వింగ్) ఏ.ఆర్.శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. సాధారణ రోజుల్లో 50వేలకు పైగా వస్తున్న వీక్షకుల సంఖ్య శని, ఆదివారాల్లో లక్షకు పైగా వస్తున్నారన్నారు. ఇప్పటి వరకు 41మందిని అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరచడంతో..కొందరికి మూ డు, కొందరికి ఏడు, కొందరికి పదిరోజుల పా టు జైలు శిక్షను న్యాయస్థానం విధించినట్లు చెప్పారు. ఎంతటి రద్దీ ప్రదేశమైనా, ఎన్ని లక్షల మంది వీక్షకులు వచ్చినా తాము ఎల్లప్పుడూ మహిళల భద్రత విషయంలో ముందంజలో ఉంటామని షీటీం అడిషినల్ డీసీపీ శిరీష రాఘవేంద్ర తెలిపారు.

జలమండలి సేవలు భేష్..



కొనియాడిన చెన్నై వాటర్ బోర్డు అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జలమండలి సేవలు ఎంతో బాగున్నాయని చెన్నై వాటర్ బోర్డు అధికారులు ప్రశంసించారు. తమిళనాడు నుంచి ముగ్గురు అధికారులతో కూడిన బృందం జలమండలి అందిస్తున్న సేవలు, మంచినీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణ, సాంకేతిక వినియోగం, రెవెన్యూ, తదితర అంశాలపై అధ్యయనం కోసం శనివారం నగరానికి వచ్చింది. ఆ రాష్ట్ర అడిషనల్ చీఫ్ సెక్రటరీ మురుగానందం, చెన్నై వాటర్ బోర్డు ఎండీ కిర్లోష్ కుమార్, చీఫ్ ఇంజినీర్ రామస్వామిలు ఈ బృందంలో ఉన్నారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఎండీ దానకిషోర్... జలమండలి అందిస్తున్న సేవలు, చేపట్టిన సంస్కరణలు పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా వివరించారు.

- నగరంతోపాటు ఓఆర్‌ఆర్ వరకు అందిస్తున్న తాగునీరు, మురుగు నీటి శుద్ధి ప్రక్రియ, ఎస్టీపీల నిర్మాణం, ఇందులో ఉపయోగిస్తున్న ఆధునిక సాంకేతికత, సామగ్రి, జెట్టింగ్ మిషన్, సివర్ క్రాక్ మిషన్ వంటి వివిధ యంత్రాల పనితీరును తెలియజేశారు.
- ఐటీ విభాగంలో తీసుకువచ్చిన డిజిటల్ మానిటరింగ్, యాన్యువల్ మెయింటెనెన్స్ సిస్టం (ఏఎంఎస్), సేఫ్టీ ప్రొటోకాల్ టీమ్స్ (ఎస్పీటీ), జలమండలి రూపొందించిన యాప్‌ల పనితీరు గురించి చెప్పారు. కార్మికుల భద్రత కోసం తీసుకుంటున్న చర్యలను తెలిపారు.

మీ సేవలు ఆదర్శప్రాయం..

ఈ సందర్భంగా అడిషనల్ సీఎస్ మురుగానందం మాట్లాడుతూ.. హైదరాబాద్ వాటర్ బోర్డు అవలంబిస్తున్న పద్ధతులు, విధానాలు అధ్యయనం చేయడానికి వచ్చామని, జలమండలి అనుసరిస్తున్న మానవ రహిత మురుగు శుద్ధి విధానాలు ఇతర నగరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. ప్రత్యేక శ్రద్ధ ఉంటే తప్ప.. ఇలాంటివి చేయలేమన్నారు. చెన్నై వాటర్ బోర్డు ఎండీ కిర్లోష్ కుమార్ మాట్లాడుతూ.. జలమండలి ఐటీ విభాగంలో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులను ప్రశంసించారు. చెన్నైలో సైతం వీటిని అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం వారు నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి జలమండలి కార్యక్రమాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఈడీ డా.ఎం. సత్య నారాయణ, ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ బాబు, రెవెన్యూ డైరెక్టర్ వి.ఎల్. ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపటితో ముగియనున్న నర్సరీ మేళా



ఖైరతాబాద్: మనస్సుకు ఆహ్లాదాన్ని పంచే పూల మొక్కలు.. ఆక్సిజన్, మెడిసిన్ ప్లాంట్స్‌తో పాటు అరుదైన పండ్లు, కూరగాయల మొక్కల నుంచి కిచెన్, టెర్రస్ గార్డెన్‌లలో పెంచుకునే మొక్కలు...వాటిని పెంచేందుకు అవసరమైన అందమైన కుండీలు, పనిముట్లు, ఎరువులు ఇలా అన్నీ ఒకేచోట లభిస్తుండటంతో నగర వాసులతో నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజాలోని నర్సరీ మేళా కిటకిటలాడుతోంది. నర్సరీ మేళాను రోజూ నగరవాసులు సందర్శిస్తూ మొక్కలు కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. ఎక్కువగా ఇండోర్ ప్లాంట్స్ కొనుగోలు చేసేందుకు మక్కువ చూపుతున్నారు. ఈ నెల 30 వరకు నర్సరీ మేళా అందుబాటులో ఉంటుంది.

కుంగిన రోడ్డు.. కూరుకుపోయిన మినీ టిప్పర్



హిమాయత్‌నగర్: కొద్దిరోజుల క్రితం గోశామహాల్ ప్రాంతంలోని చక్నవాడి ఘటన మరువకముందే నగరం నడిబొడ్డున ఉన్న హిమాయత్‌నగర్‌లో మరో రోడ్డు కుంగిపోయింది. డ్రైనేజీ మట్టిలోడ్‌తో వెళ్తున్న మినీ టిప్పర్ లారీ ధాటికి తట్టుకోలేకపోయిన రోడ్డు ఒక్కసారిగా కుంగిపోవడంతో భారీ గుంత ఏర్పడింది. ఆ గుంతలో టిప్పర్ వెనుక చక్రాలు కూరుకుపోయాయి. ఈ సంఘటనను చూసిన స్థానికులు ఒక్కసారిగా భయందోళనకు గురయ్యారు. ఈఘటనలో డ్రైవర్, ఇద్దరు కార్మికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని స్ట్రీట్-5 నాలా వద్ద జరిగిన ఈ సంఘటన జరిగింది. వివరాలు.. స్ట్రీట్-6లో జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయం నిర్మాణ పనుల నేపథ్యంలో డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. ఇటిక్యాల యాదగిరి అనే డ్రైవర్ తన టిప్పర్ సాయంతో ఉదయం ఓ టన్ను బరువు గల లోడును స్ట్రీట్-5 నాలా మీదుగా తీసుకెళ్లాడు. రెండో ట్రిప్పు సుమారు మధ్యాహ్నం 12గంటల సమయంలో తీసికెళ్తుండగా..నాలా దాటిని వెంటనే రోడ్డు కుంగిపోయింది. రోడ్డులో ఒక్కసారిగా వెనకాల చక్రాలు దిగిపోయాయి. ఈఘటనలో డ్రైవర్, క్లీనర్‌లు క్షేమంగా బయటపడ్డారు. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో కూరుకుపోయిన టిప్పర్‌ను సాయంత్రం 5గంటలయ్యే వరకు బయటకు తీయలేదు. టిప్పర్ కాంట్రాక్టర్‌నే జేసీబీ తెచ్చుకోవాలని ఇంజనీరింగ్ డీఈ దుర్గాప్రసాద్, ఏఈ దివ్యతేజలు సూచించారు. మా జేసీపీ రావాలంటే టైం పట్టిద్ది మీరు ఒక ఫోన్ చేస్తే జేసీబీ వస్తుందని అధికారులను టిప్పర్ డ్రైవర్, కాంట్రాక్టర్ ప్రాధేయపడ్డారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న జేసీబీ హిమాయత్‌నగర్ స్ట్రీట్-5 సంఘటన స్థలానికి వచ్చేందుకు సుమారు ఐదు గంటల సమయం పట్టడంతో స్థానికుల నుంచి నిరసన వ్యక్తమైంది. ఈ ఐదు గంటల పాటు డీఈ దుర్గాప్రసాద్, ఏఈ దివ్యతేజలు ఇద్దరూ చోద్యం చూస్తూ టైం పాస్ చేయడంతో..పోలీసులు రంగప్రవేశం చేసి ఒత్తిడి చేయగా..సాయంత్రం 5గంటలకు దానిని అక్కడ నుంచి తొలగించారు.

‘ధృవ’లో అలరించిన ముకాబ్‌లా

ముఖ్యఅతిథిగా హాజరైన సినీగేయ రచయిత, చంద్రబోస్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న చంద్రబోస్

మేడ్చల్‌రూరల్: కండ్లకోయలోని ధృవ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో 20వ ఆల్ ఇండియా యూజీ స్టూడెంట్స్ ఫెస్ట్ (ముకాబ్ లా) అలరించింది. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ వేడుకలో దేశవ్యాప్తంగా ఉన్న పలు కళాశాలల నుండి 600 రిజిస్ట్రేషన్లు జరగ్గా 400 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. రూ.55 వేల నగదు బహుమతులతో పాటు రూ.1 కోటి విలువైన స్కాలర్‌షిప్‌లు, ప్రైజ్‌లు అందజేశారు. విద్యార్థులకు డ్యాన్స్, సంగీతం,క్విజ్, వ్యాసరచన, స్పీచ్, రంగోలీ వంటి పలు రకాలు పోటీలు రెండు రోజుల పాటు నిర్వహించారు. శనివారం ముగింపు కార్యక్రమంలో సినీగేయ రచయిత, గోల్డెన్ గ్లోబ్ అవార్డు గ్రహీత చంద్రబోస్ ముఖ్య అతిథిగా పాల్గొని కళాశాల చైర్మెన్ ప్రతాప్‌రెడ్డితో కలిసి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రొఫెసర్ ప్రియ నాయుడుకు ప్రత్యేకంగా జ్ఞాపిక ప్రదానం చేశారు. అనంతరం కళాశాల చైర్మెన్ ప్రతాప్‌రెడ్డి దంపతులు చంద్రబోస్ దంపతులను సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

ట్రాన్స్‌జెండర్స్ క్లినిక్ ప్రారంభం



ట్రాన్స్‌జెండర్స్ క్లినిక్ ప్రారంభోత్సవంలో నిర్వాహకులు

పంజగుట్ట: ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్ క్లబ్ సికింద్రాబాద్ సహకారంతో మొట్టమొదటి సారిగా సోమాజిగూడలోని ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్ భవనంలో ట్రాన్స్‌జెండర్లకు క్లినిక్ ప్రారంభించారు. ఇన్నర్ వీల్ ఇండియా అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ సుర్జిత్ కౌర్, ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు కాంతిలాల్ షాలు ఈ క్లినిక్‌ను ప్రారంభించారు. ట్రాన్స్‌జెండర్లకు అన్ని రకాల చికిత్సలు ఇక్కడ అందిస్తామని తెలిపారు. అంతే కాకుండా తమ సంస్థల ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లు గౌరవప్రదంగా బతికేందుకు బెడ్‌సైడ్ అసిస్టెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మూడు నెలల సర్టిఫికెట్ కోర్సు ఉంటుందన్నారు. ఉదయం 11 నుండి మధ్యాహ్నం 3 గంటలవరకు క్లాస్‌లు ఉంటాయని ఈ నెలాఖరువరకు దరఖాస్తు చేసుకోవచ్చునని, ఫిబ్రవరి మొదటి వారంలో క్లాసులు ప్రారంభమౌతాయన్నారు. కార్యక్రమంలో ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి డాక్టర్ రేణు కౌర్, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ అధ్యక్షురాలు జయంతి కన్నన్ పాల్గొన్నారు.

యజమానిపైనే కూల్చివేత వ్యయం

డెక్కన్ భవనంపై జీహెచ్‌ఎంసీ చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుతం కూల్చివేతలు జరుగుతున్న సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్‌లోని డెక్కన్ కార్పొరేట్ భవనం కూల్చివేత ఖర్చుల్ని భవన యజమానికే విధించనున్నారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ నిర్ణయం తీసుకుంది. అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను కూల్చివేసేందుకు జీహెచ్‌ఎంసీపై భారం పడుతుండటంతో.. సదరు భవనాల కూల్చివేతల వ్యయాన్ని అక్రమార్కులకే వేయాలని ఎంతోకాలం క్రితమే నిర్ణయించారు. కానీ ఇప్పటి వరకు అలా విధించిన దాఖలాల్లేవు. ఇటీవల అగ్ని ప్రమాదం జరిగిన భవనంలో పై రెండు అంతస్తులు అనుమతుల్లేకుండా నిర్మించినవే కావడం, ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్లు సైతం తగిన విధంగా లేకపోవడం తెలిసిందే. పరిసర ప్రాంతాల ప్రజలకు సైతం దీన్నుంచి ముప్పు పొంచి ఉండటంతో జీహెచ్‌ఎంసీ కూల్చివేతలు చేపట్టింది. ఇందుకుగాను దాదాపు రూ.30 లక్షలు ఖర్చు చేయనుంది. ఈ పనులు పూర్తి చేసే కాంట్రాక్టు ఏజెన్సీకి చెల్లించాల్సిన ఈ వ్యయాన్ని భవన యజమాని నుంచే ఇప్పించనున్నట్లు సంబంధిత అధికారి తెలిపారు. కాంట్రాక్టు సంస్థకు చెల్లించాల్సిన సొమ్మును యజమాని ద్వారానే ఇప్పిస్తామని, లేని పక్షంలో జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టు సంస్థకు చెల్లించాక భవన యజమాని నుంచి వసూలు చేస్తామన్నారు.

అనుమతి కోసం వచ్చినప్పుడైనా తప్పదు..

ఒకవేళ ఇప్పుడు చెల్లించకపోయినా సదరు స్థలంలో తిరిగి కొత్త భవన నిర్మాణానికి అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడైనా ఈ వ్యయం చెల్లించాకే అనుమతినిస్తామని పేర్కొన్నారు

మిమ్మల్ని కోటీశ్వరుల్ని చేస్తాం..

- ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సైబర్ వల
- లక్షలు సంపాదించాలనే ఆశతో మోసపోతున్న అమాయకులు

హిమాయత్‌నగర్: ‘హాయ్ నా పేరు రాహుల్ నేను ఓ పెద్ద కంపెనీకి సీఈఓని. నేను చెప్పినట్లు వింటే మిమ్మల్ని తక్కువ సమయంలో కోటీశ్వరుల్ని చేస్తా’ అంటూ సైబర్ నేరగాళ్లు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వల వేస్తున్నారు. ఈ వలలో పడుతున్న అమాయకులు లక్షల రూపాయిలు పోగొట్టుకుంటూ అప్పుల ఊబిలో కూరుకుపోయి న్యాయం చేయాలంటూ సైబర్ క్రైం పోలీసుల్ని ఆశ్రయిస్తున్నారు. ఈ తరహా మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలంటూ సైబర్‌క్రైం పోలీసులు సూచిస్తున్నారు.

ఇలా చేస్తున్నారు

ఇన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించిన కంపెనీ సీఈఓగా ఇన్‌స్టాగామ్ వ్యక్తిగత అకౌంట్‌లో మెసేజ్ చేస్తున్నారు. దీనికి స్పందించగానే చక్కగా మాట కలుపుతున్నారు. తాను ఈరోజు కోట్లు సంపాదించడానికి కారణం ఇన్వెస్ట్‌మెంట్ చేయడం వల్లనే అంటూ వల వేస్తున్నారు. మీరెందుకు ప్రయత్నించకూడదని నెమ్మదిగా వారి మనసు మార్చే ప్రయత్నం చేస్తున్నారు. దీనికి సరేనంటూ ఒప్పుకున్న వారి నుంచి ముందుగా ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌కు సంబంధించి జీ-మెయిల్‌ను తెలుసుకుంటున్నారు. ఆ జీ-మెయిల్ స్థానంలో తమ కంపెనీ పేరుతో ఉన్న జీ-మెయిల్ అకౌంట్‌తో లాగిన్ అవ్వాలని సూచిస్తున్నారు. కోట్లు వస్తాయి కదా అని ఆశ పడ్డ అమాయకులు సైబర్ నేరగాళ్లు చెప్పినట్లుగా చేస్తున్నారు. జీ-మెయిల్ మార్చిన వెంటనే ఫర్‌గెట్ పాస్‌వర్డ్ కొడుతున్నారు. ఈ ఫర్‌గెట్ పాస్‌వర్డ్ నోటిఫికేషన్ తాజాగా మార్చిన జీ-మెయిల్ అకౌంట్‌కు వెళ్తుంది. అంతే కొత్తగా పాస్‌వర్డ్‌ను క్రియేట్ చేసి టూ స్టెప్ అథంటికేషన్ ఆప్షన్ చేస్తున్నారు. అంతే..ఆ ప్రొఫైల్‌కు చెందిన వ్యక్తి ఆ ఇన్‌స్టాగ్రామ్ పేజీలో ఏమీ చేయలేనికి స్థితికి వెళ్లిపోతున్నాడు. దీంతో తాను తక్కువ సమయంలో ఇన్వెస్ట్ చేసి లక్షలు సంపాదించానంటూ ఇన్‌స్టాగామ్ స్టోరీ పెడుతున్నారు. దీని చూసిన స్నేహితులు తాము కూడా చేస్తామంటూ ఇన్‌బాక్స్‌లో మాట కలుపుతున్నారు. ఇలా ఒక్కొక్కరిని వారి వలలో వేసుకుంటున్న మాయగాళ్లు వారు చెప్పిన వెబ్‌సైట్‌లలో ఇన్వెస్ట్ చేపించి లక్షల రూపాయిలు దోచేసుకుంటున్నారు. డబ్బు అంతా పోయాక వాట్సప్ లేదా ఆన్ కాల్లో మాత్రమే విషయం బయటపడుతుంది.

ఈ మాయగాళ్ల వలలో పడొద్దు



కంపెనీ సీఈఓలు ఎవరూ కూడా నేరుగా ఇన్‌స్టాగామ్ ఖాతాల్లో మెసేజీలు చేయరు. మీకు కోట్లు వచ్చేలా చేస్తామంటూ మాయమాటలు చెప్పి మోసగిస్తున్న వారి వలలో పడొద్దు. అలా మీకు మెసేజ్ వస్తే రిపోర్ట్ ప్రెస్‌చేయండి. మీకు మెసేజ్ వచ్చిన దానిని స్క్రీన్ షాట్ తీసి స్టేటస్‌గా పెట్టండి, మీ స్నేహితులు ఎవరూ మోసపోకుండా మీరే అలర్టె చేయండి. ప్రతిరోజూ వస్తున్న 10-15 కేసుల్లో 3-4 కేసులు ఈతరహావే ఉంటున్నాయి.

– కేవీఎం ప్రసాద్, సిటీసైబర్‌క్రైం ఏసీపీ